క్లుప్తంగా

వీరాంజనేయునికి విశేషాలంకరణ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ఈవో టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ తెల్లమేకల హనుమంతరావు స్వామికి మొక్కుబడిగా రూ.30 వేల వ్యయంతో ఎర్ర గులాబీలతో గజమాల సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వసతి గృహం సందర్శన



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని అమరావతిరోడ్డు హోసన్న మందిర్ సమీపంలో తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాపు విద్యార్థి వసతి గృహాన్ని అమెరికాలోని ఏపీటీఏ ముఖ్య సభ్యుడు, ఎన్సీఆర్ అట్లియోస్ ఇంటర్‌నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోన సురేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య యొక్క ఆవశ్యకతను వివరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అధునాతన టెక్నాలజీ గురించి విద్యార్థులకు వివరించారు. చదువుకు తగిన ఉద్యోగ ఉపాధి మార్గాలను వివరించారు. కార్యక్రమంలో కాపు నాయకులు బాలిశెట్టి విజయ్ కుమార్, గరికపాటి సతీష్, డేగల వెంకటేశ్వరావు, పరిమి సత్యం, కూటాల కృష్ణ, ఇంకొల్లు శంకర్, చెమిటికంటి కిరణ్, తుమ్మల నరసింహ తదితరులు పాల్గొని అతిథిని ఘనంగా సన్మానించారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎన్‌టీ (ముక్కు, గొంతు, చెవి) విభాగం వైద్యులు రోగికి అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్‌తో కలిసి ఆపరేషన్ వివరాలను ఆయన వెల్లడించారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గౌస్ పీర్ ముక్కులో ట్యూమర్ ఉండి.. రక్తం కారుతూ గత నెల 22న జీజీహెచ్‌కు వచ్చినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు, తిరుపతిలోని హాస్పిటల్స్‌కు తీసుకెళ్లగా..ఒకరు కుదరదని చెప్పగా..మరొకరు ఆపరేషన్‌కు రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారన్నారు. దీంతో గౌస్ పీర్ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్ రోగిని పరీక్షించి, రక్తం వచ్చే గడ్డ ముక్కు నుంచి నోట్లోకు వెళ్లిందని నిర్ధారించారన్నారు. ఆపరేషన్ చేస్తే గుండెకు సంబంధించి కూడా సమస్యలు ఉంటాయని, కుటుంబ సభ్యుల అనుమతి తీసుకుని ఈ నెల 12న ఈఎన్‌టీ, కార్డియాలజీ విభాగం వైద్యులు సంయుక్తంగా ఆపరేషన్ చేశారని తెలిపారు. రక్తం వచ్చే ట్యూమర్‌ను తొలగించారని, ప్రస్తుతం పేషంట్ ఆరోగ్యం కుదుటపడిందన్నారు. రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామన్నారు. కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.శ్రీకాంత్, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవీంద్ర బాబు, డాక్టర్ అరుణ్‌కుమార్, మత్తు వైద్యుడు శ్యాంకుమార్‌లు పాల్గొన్నారని చెప్పారు. సుమారు రూ.5లక్షల ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా ఉచితంగా చేశామని డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొన్న కార్డియాలజీ, ఈఎన్‌టీ వైద్యులకు అభినందనలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణబాబు కాలనీలోని కొవ్వూరు భవానీ (30)తో చంద్రశేఖర్‌కు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కుటుంబ కలహాల నేపథ్యంలో భవానీ శనివారం ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై గుర్తు తెలియని ముగ్గురు దాడిచేసి గాయపరిచిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన సాయి ఖాశింను శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కర్రలతో దాడి చేశారు. అనంతరం పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదం మత్తులో భవిత చిత్తు

- నగర శివారుల్లో జోరుగా పేకాట, కోడి పందేలు
- ప్రతి రోజూ లక్షల్లో పందేల నిర్వహణ
- ఆస్తులను కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు



గుంటూరు రూరల్ : గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూదం, కోడి పందేల కారణంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నగర శివారులో గల కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో జనావాసాల మధ్యనే నిత్యం జూదం జోరుగా సాగుతున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. నగరంలోని శివారు ప్రాంతాలైన ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, జొన్నలగడ్డ రోడ్డు, గ్రామ శివారు ప్రాంతాలు, పెద్దపలకలూరు కొండలు, చిన్నపలకలూరు తోటలు, పేరేచర్ల క్వారీలు, వెంగళాయపాలెం, పొత్తూరు, ఓబులునాయుడుపాలెం, కై లాసగిరి కొండ ప్రాంతాలు, చౌడవరం, ఎన్‌హెచ్ 16 హైవే పరిసర ప్రాంతాల్లో నిత్యం పేకాట(జూదం) జోరుగా సాగుతుంది. దీంతో పాటు కోడి పందేలు సైతం జరుగుతున్నట్లు సమాచారం. పెద్ద ఎత్తున జూదం, కోడి పందేలు జరుగుతున్నా కనీసం సంబంధిత అధికారులకు సమాచారం కూడా ఉన్నట్లు కనిపించటం లేదని గ్రామాల్లో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో జొన్నలగడ్డ రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డులో గల అపార్ట్ మెంట్‌లు, నిర్జన ప్రదేశాల్లో జరుగుతున్న జూద క్రీడల్లో ఎందరో లక్షల్లో ధనం కోల్పోవటంతో అప్పులు చేసి ఐపీ పెట్టిమరీ పరారయిన సంఘటనలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి.

జూదం జరుగుతుందిలా..

నగరశివారుల్లోని అపార్ట్‌మెంట్‌లు, నిర్జన ప్రదేశాలు, శివారు కాలనీల్లో ఒక ఫ్లాటు లేదా ఇల్లును అద్దెకు తీసుకుంటారు. ఆ నివాసం ముందు ఒకరిద్దరిని కాపలాగా ఉంచుతారు. జూదం ఆడేందుకు వచ్చే వ్యక్తులు తమ వాహనాలను పక్కనే ఉండే రోడ్లు, సమీపంలోని దుకాణాల ఎదుట నిలిపి ఎవ్వరికీ తెలియకుండా నడుచుకుంటూ జూదం ఆడే ప్రదేశానికి వెళతారు. ఉదయం మొదలుకుని రాత్రుళ్లు, తెల్లవారే వరకు జూదం జరుగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో జూదం ఆడేవారికి మద్యం, భోజనాలు, అల్పాహారం సైతం అక్కడికే అందించే ఏర్పాటు సైతం చేసుకుంటారు. లోపల జూదం ఆడేవారు ఆడుతుండగా బయటనుంచి వారికి కావాల్సిన సౌకర్యాలు అవే వస్తుంటాయి. ఇలా అందించే వారికి రోజుకూలీ రూ.600 నుంచి రూ.800లు వరకూ ఉంటుంది. ఇలా వారికి సరుకులు అందించే వ్యక్తులే బయట ఇద్దరు లేదా ముగ్గురు ఉంటారంటే లోపల ఆడేవారు ఎంత మంది ఉంటారో... ఎన్ని లక్షల రూపాయల మొత్తంలో జూదం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

కోడి పందేలు ఇలా..

కోడి పందేలు గతంలో పండుగలు, పర్వదినాల్లో చూసేవారం. కానీ నేడు ప్రతి రోజు పండుగగానే భావించి కోడి పందేలను నిర్వహించుకుంటున్నారు. ఈ పందేలకు గ్రామాల శివారు ప్రాంతాలు, కొండల్లోని ఖాళీ మైదానాలు నిలయంగా మారాయి. ఈ పందేలు ఒక గంట ఒకచోట నిర్వహిస్తే వెంటనే ఆ ప్రదేశాన్ని ఖాళీచేసి మరో ప్రదేశానికి వెళతారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ తెల్లవారు జామున 5 గంటల నుంచి 7 గంటల వరకూ ఈ కోడి పందేలను నిర్వహిస్తారు. దీని కోసం నగరంలోని వారే కాకుండా తెనాలి, రేపల్లె, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, అమరావతి తదితర ప్రాంతాలనుంచి కూడా పందెం గాళ్లు వస్తున్నారంటే కోడి పందేలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇంత జరుగుతున్నా అధికారులకు మాత్రం ఏమి తెలియనట్లు వ్యవహరిస్తుంటారు. ఐతే సంబంధిత అధికారులకు భారీ స్థాయిలో మామూళ్లు అందుతుంటాయని వారు ఎప్పుడు వచ్చేది ఎక్కడికి వచ్చేది కూడా నిర్వాహకులకు ముందే సమాచారం అందుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూదం, కోడిపందేల నిర్వహణపై నిఘాను పెంచి అమాయక ప్రజల కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

> **ప్రత్యేక నిఘా పెడతాం**
>
> నగర శివారుల్లో జూదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంది. పోలీసు సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకుంటాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు.
>
> –వంశీధర్, సీఐ, నల్లపాడు.

నిర్లక్ష్యం నీడలో పచ్చదనం కనుమరుగు

- పొన్నూరులో పచ్చదనం పరిరక్షణలో అధికారుల తాత్సారం
- పట్టణంలో కనుమరుగైన మొక్కలు
- మరికొన్ని చోట్ల మొక్కలకు నీరందక ఎండిన వైనం



నిడుబ్రోలు బ్రిడ్జి వద్ద మొక్కలు ఎండిపోయి వృథాగా పడిఉన్న కుండీలు

పొన్నూరు: పచ్చదనంతో పాటు నిలువ నీడకోసం వర్షాకాలంలో చెట్లు నాటి వాటిని పరిరక్షిస్తుంటారు. పట్టణాల్లో చెట్ల పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని దానికి అనుగుణంగా సంబంధిత అధికార గణం ముందుకు సాగుతుంటారు. దీంతో కాస్తో కూస్తో పచ్చదనం అక్కడక్కడ మనకు కనిపిస్తుంటుంది. కానీ పొన్నూరులో పచ్చదనం పెంపుదల విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో లక్ష్యం కాస్త నీరు గారిపోయింది. గతంలో పట్టణాభివృద్ధిలో భాగంగా నిడుబ్రోలు బ్రిడ్జితో పాటు పలు ప్రాంతాల్లో సిమెంటు కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. వాటిని పరిరక్షించడంలో యంత్రాంగం విఫలమవడంతో ప్రజాధనం వృథా కావడమే తప్ప ఫలితం లభించలేదు.

నిలిచేందుకు నీడలేని దుస్థితి

రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడక్కడ ఉన్న చెట్లను నరికివేయడంతో ఉన్న పచ్చదనం కాస్త ఆవిరైంది. పట్టణంలో పచ్చదనాన్ని పరిరక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రధాన కూడళ్లలో చెట్లు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలకు నిలువ నీడ లేకుండా పోతుంది. ప్రతిరోజు మున్సిపల్ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు అందించి సంరక్షించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీన్ని ఆచరణలో అమలు చేయకపోవడంతో పొన్నూరులో పచ్చదనం దాదాపుగా కనుమరుగైపోయింది. అరకొరగా పట్టణంలోని నిడుబ్రోలు బ్రిడ్జిపై కుండీలను ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు నాటారు. వాటికి సక్రమంగా నీరు అందించక పోవడంతో కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. మరికొన్ని ఆవులు తిని పాడై పోయాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ వర్షాకాలంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో మొహరం



అలంకరణలో పీర్లు

పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరంను మొల్లా ముజావర్ల కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. హాజరత్ మొహమ్మద్ వారి మనుమలు హాజరత్ ఇమామే హసన్, హాజరత్ ఇమామే హుస్సేన్ వారి త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా ఏడో రోజు శనివారం పీర్ల చావిడిలో హాజరత్ అలీ జెండా ఆవిష్కరించారు. ఈ నెల 15న 9వ రోజు పీర్ల గుండంలో నడవటం జరుగుతుందని మొల్లా ముజావర్ల కమిటీ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. మొల్లా కరీమ్, మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని,మొల్లా నజీర్, షేక్ , ఖాదర్, షేక్ మునవార్, మొల్లా నాజుముద్దీన్, మొల్లా ఖాలీల్ బాషా, మొల్లా బాజి, షేక్.గౌస్, మొల్లా అఫ్రీద్, మొల్లా అర్షద్, మొల్లా జలీల్, మొల్లా ఇమ్రాన్, షేక్ రఫీ, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మనోజ్‌కుమార్‌రెడ్డి మృతదేహం

గుంటూరు రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు నగరాలు మునుస్వామినగర్ రెండవ లైనుకు చెందిన తల్లపురెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి(30) నగరంలో కొరియర్ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కొరియర్ పనికి వెళ్లి రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చి ఇంట్లో తన గదిలో నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారినా నిద్రలేవకపోవటంతో కుటుంబసభ్యులు గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కి లుంగితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని దించి పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణం అప్పుల బాధ లేనని బంధువులు తెలిపారని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జ్వరంతో చికిత్స పొందుతున్న గర్భిణి మృతి



మృతురాలు మైలా నిరీషా

పెదకాకాని: జ్వరంతో చికిత్స పొందుతున్న గర్భిణి మృతి చెందిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే 9 నెలల గర్భిణి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో వివాదం చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెంకు చెందిన మైలా గోపీకృష్ణకు రత్నాలచెరువుకు చెందిన నిరీషాతో 2019లో వివాహం జరిగింది. వారికి 16 నెలల పాప గుణదీక్షిత సంతానం. నిరీషా తొలి కాన్పు పెదకాకాని గ్రామంలోని శ్రీహనుమత్ కాశీ వరప్రసాద బాబూజీ ట్రస్టు ఆసుపత్రిలో చేయించుకుంది. ప్రస్తుతం ఆమె 9 నెలల గర్భిణి. జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 10న కాశీ వనాశ్రమం ఆసుపత్రిలోనే చేర్పించారు. చికిత్స పొందుతున్న మైలా నిరీషా(26) పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున మరణించింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే నిరీషా మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో ఆసుపత్రి వద్ద వివాదాస్పద వాతావరణం చోటు చేసుకుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ కె వీరాస్వామి, సిబ్బంది విచారణ చేపట్టారు. కొద్దిసేపటి తరువాత ఆసుపత్రి నిర్వాహకులు, మృతురాలి బంధువులకు మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో మృతదేహాన్ని ఆసుపత్రి అంబులెన్స్‌లో యర్రబాలెం తరలించారు.

గాయపడిన వృద్ధుడి మృతి

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధుడు శనివారం మరణించాడు. పల్నాడు జిల్లా అమరావతి మండలం నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన చింకా కోటేశ్వరరావు (59) చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లటానికి ద్విచక్ర వాహనంపై ఈ నెల 7న బయలు దేరాడు. మార్గ మధ్యంలో చేబ్రోలు శివారు శ్రీమంత్ స్థూపం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అధికారులు అందజేశారు.

కులం పేరుతో దూషించిన వారిని శిక్షించాలి

నెహ్రూనగర్: కులం పేరుతో దూషించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు సుబ్బయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబును కొందరు వ్యక్తులు ఫోన్‌లో కులం పేరుతో దూషిస్తూ, పరుష వ్యాఖ్యలు చేసి మానసికంగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. దీనిపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కానీ ఇంత వరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. తమను ఏమీ చేయలేవు అంటూ బెదిరింపులకు దిగారంటూ ఆరోపించారు. అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని... లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి

చేబ్రోలు: పెట్రోలు బంకులోకి వెళ్లి బయటకు వస్తున్న బైక్‌ను లారీ ఢీ కొట్టడంతో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెం సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని వడ్లమూడి గరువుపాలెం పరిధిలోని పెట్రోలు బంక్‌లో రాత్రి సమయంలో పెట్రోలు కోసం వెళ్లి తిరిగి బయటకు బైక్‌పై వస్తున్న యువకుడిని తెనాలి నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో సుమారు 25 ఏళ్ల వయసు గలిగిన గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు ఉపాధ్యాయులపై వేటుకు రంగం సిద్ధం..!

పెదకాకాని: బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వర్తించిన నలుగురు ఉపాధ్యాయులపై వేటుకు రంగం సిద్ధమైంది. మండల కేంద్రమైన పెదకాకాని ప్రాథమిక పాఠశాలలో ఇనుప గేటు పడి తీవ్ర గాయాలతో విద్యార్థిని చికిత్స పొందుతున్న సంఘటనపై విద్యాశాఖ అధికారులు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పెదకాకాని యాదవపాలెం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక ఇంటర్‌వెల్ సమయంలో తినుబండారాలు కొనుక్కునేందుకు హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డిని అనుమతి కోరింది. హెచ్‌ఎం అనుమతించక పోవడంతో ఆ బాలిక మరొక బాలిక షేక్ మాషినాతో కలసి గోడ దూకి తినుబండారాలు కొనుక్కునేందుకు వెళ్లారు. ఆ సమయంలో మాషినా గోడకు ఆనించి ఉన్న ఇనుపగేటును పట్టుకోవడంతో ఆ గేటు మాషినాపై పడి తలకు కాలికి తీవ్రగాయమైంది. చెవి నుండి రక్తం కారడంతో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న డాక్టర్లు రెండు రోజులు గడిస్తేగానీ ఏ విషయం చెప్పలేమని ప్రకటించారు. ఆసుపత్రిలో విద్యార్థిని చికిత్స పొందుతున్న విషయంపై విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు నలుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

చేబ్రోలు మండలంలో భారీ వర్షం

- చెరువులను తలపిస్తున్న వరి పొలాలు
- పొలాల్లో నిల్వ నీటిని బయటకు పంపాలని సూచిస్తున్న వ్యవసాయాధికారులు
- 107 మి.మీ వర్షపాతం నమోదు





చేబ్రోలు, మంచాల గ్రామాల్లో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో శనివారం కురిసిన భారీ వర్షంతో మాగాణి వరి పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరువాత వరుణుడి కోసం ఎదురు చూసిన రైతులకు శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో సుమారు 16వేల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం ఉంది. నారుమళ్లు పోసి వరినాట్లు వేసే పద్ధతి నుంచి గత నాలుగేళ్లుగా వెద పద్ధతిలో రైతులు వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు పది, పదిహేను రోజులుగా వెదపద్ధతిలో విత్తనాలు నాటారు. శనివారం కురిసిన భారీ వర్షంతో వరిపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లోని వర్షపునీరు బయటకు పోయే మార్గం లేకపోవటంతో చిన్న మొక్కలు నీట మునిగాయి. ఈ ఏడాది సాగునీటి, మురుగునీటి కాలువలు మరమ్మతులకు నోచుకోక పోవటంతో పొలాల్లోని నీరు బయటకు పోయే పరిస్థితి కనిపించటం లేదు. ఒకటి రెండు రోజుల్లో పొలాల్లోని నీరు బయటకు పోకపోతే తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.చేబ్రోలు మండలంలో శనివారం 107 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

కార్మెల్‌మాత పండుగకు ఏర్పాట్లు పూర్తి



చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు



బొమ్మల దుకాణాలు

ఫిరంగిపురం: కార్మెల్ మాత పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం. ఫాతిమా మర్రెడ్డి శనివారం తెలిపారు. పండుగ సందర్భంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన గదులు, స్నానం కోసం ట్యాప్‌లు, తాగునీటి వసతి, భోజన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పండుగ సందర్భంగా కొండ మెట్ల బజారు, చర్చి ప్రాంగణం, రాజాపేట ప్రాంతాల్లో బొమ్మల అంగళ్లు, తినుబండారాల దుకాణాలు, ఐస్ క్రీం బండ్లు, పలురకాల రంగుల రాటాన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండ కింది భాగం నుంచి కార్మెల్ మాత మందిరం వరకు రంగురంగుల విద్యుత్ దీపాలు అమర్చారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన పులిపాక విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని శ్రీ మహాకవి తిక్కన–పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీ రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలా పృథ్వి మనోజ్ కుమార్ 579 మార్కులతో గుంటూరు నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలువగా, 566 మార్కులు సాధించిన షేక్ బీబీ ఆయేషా ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు

అన్న క్యాంటీన్లను సిద్ధం చేయాలి

నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



భవనానికి చేస్తున్న మరమ్మతులు

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్లను ఆగష్టు మొదటి వారానికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న మరమ్మతు పనులపై శనివారం ఇంజినీరింగ్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 8 అన్న క్యాంటీన్లను ఆగస్ట్ మొదటి వారానికి వినియోగంలోకి తీసుకురావడానికి ఇప్పటికే రూ.74 లక్షలతో టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యత ప్రమాణాల్లో రాజీ లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా పెయింటింగ్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, స్విచ్ బోర్డ్‌లు, లైట్లు, గ్లాస్ డోర్స్, ఫ్లోర్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. హ్యాండ్ వాష్ పాయింట్స్, నీటి సౌకర్యం పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిపై డీఈఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, కమిషనర్ చాంబర్‌కి నివేదిక ఇవ్వాలన్నారు.

కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఆత్మహత్య



పట్నంబజారు: కుటుంబ కలహాలు, అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలా పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనేరు సెంటర్ సమీపంలో నివాసముంటున్న రాసా శివయ్య (40) చికెన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య సాంబ్రాజ్యం , ఇద్దరు సంతానం ఉన్నారు. గతంలో భార్యతో వివాదం కావడంతో ఇద్దరూ కొంత కాలం పాటు వేరుగా ఉన్నారు. రెండేళ్ల నుంచి తిరిగి కలిసి ఉంటున్నారు. కుటుంబ కలహాలు, కొద్దిపాటి అప్పులు ఉన్న నేపథ్యంలో.. శనివారం కుటుంబ సభ్యులు విజయవాడ కనక దుర్గమ్మ గుడికి వెళ్లిన క్రమంలో శివయ్య ఇంటిలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.